# అంపకం



శివయ్య తన ఒక్కగానొక్క కూతురు, సీతని అత్తవారింటికి పంపుతున్నాడు. పొద్దుట్నుంచి ఇల్లంతా మహా సందడిగా ఉంది. శివయ్య కాలు గాలిన పిల్లిలా బజారుకీ, ఇంటికీ ఒకే పరుగు.

'అరటిపళ్ళ గెల వచ్చిందా?'

'అరిసెలు మూట కట్టారా?'

'సున్ని ఉండల డబ్బా ఎక్కడ?' అంటూ ఇల్లంతా కదం తొక్కుతున్నాడు. శివయ్య భార్య పార్వతమ్మకి ఊపిరి సలపటంలేదు. ఎందరమ్మలక్కలు సాయం

చేసినా వూరికే హైరానా పడిపోతూ గదులన్నీ చుట్టుముట్టి వస్తోంది.

సీతకి పట్టుచీర కట్టారు. పాదాలనిండా పసుపురాసి పారాణి పెట్టి నుదుట పెద్ద బొట్టు పెట్టి బుగ్గన చాదుచుక్క అద్దారు. తోటి ఈడువాళ్ళు ఆటలు పట్టిస్తుంటే గదిలో పీటమీంచి లేచి ఇవతలకు రాలేదు. అంతా వెళ్ళిపోయినా తలవంచుకు పీటమీదే కూర్చుంది. పాదాలకున్న పసుపు, పట్టుచీర పూసుకుంటుంటే ఆలోచించుకుంటోంది.

"నేను వెళ్ళిపోతున్నాను. అమ్మని, నాన్నని విడిచి వెళ్ళిపోతున్నానా? ....." శివయ్య దొడ్లో వేపచెట్టుకానుకుని బెంబేలయిపోతున్నాడు. "తన తల్లి వెళ్ళిపోతోంది. తన యింటి దీపం వెళ్ళిపోతోంది....... తన చిట్టితల్లి, తనని రోజూ పలకరించకపోతే తనకి ఎట్లా గడుస్తుంది?'

పదహారేళ్ళ క్రితం పురిటింట్లో చంటిపాప కెవ్వుమంటే మహాలక్ష్మి పుట్టిందన్నారు. ఆ క్షణం నుంచి శివయ్యకి, పాపకి ప్రాణం లంకె. పార్వతమ్మ పాలిచ్చి ఉయ్యాల్లో పడుకోబెట్టటమే తప్ప, సీత ఎప్పుడూ తండ్రి చేతుల్లోనే ఉండేది. తండ్రి చేతుల మీందే పెరిగింది. నాలుగేళ్ళు వచ్చాక బళ్లో వేస్తుంటే వూరు వూరంతటినీ పిలిచాడు శివయ్య. పిల్లలందరికీ పలకా, బలపాలు, మిఠాయి పంచి పెట్టించాడు. బడినుంచి రావటం ఓ నిముషం ఆలస్యమైతే పరుగు పరుగున ఎదురువెళ్ళి భుజం మీద ఎక్కించుకుని తీసుకొచ్చేవాడు. వస్తూ వస్తూ సీత బళ్ళో కబుర్లన్నీ చెప్తుంటే శివయ్య ఆనందంగా ఊకొట్టేవాడు.

భోజనం ఎప్పుడూ ఇద్దరూ కలిసి చేయవలసిందే. కూతురికి ఏ కూర నచ్చిందో కనుక్కుని తనూ ఆ కూరే కలుపుకునేవాడు. అన్నాలయాక సన్నజాజి పందిరికింద శివయ్య పడుకుంటే సీత వెళ్ళి తండ్రి పక్కలో దూరేది. తండ్రి వొళ్ళో ముడుచుకు పడుకునేది. తండ్రిని కథలు చెప్పమని వేధించేది. శివయ్య తనకి తోచిన కథ చెప్తుంటే అంతలోనే నిద్రపోయేది. రెండు చేతులా తన్ని కావలించుకుని నిశ్చింతగా నిద్రపోయే కూతుర్ని చూస్తూ పైనించి రాలుతున్న సన్నజాజి పూలనిచూస్తూ కళ్ళనీళ్ళయిపోయేవాడు శివయ్య.

మరి రేపట్నించి తనెవరికి కథ చెప్తాడు?

సన్నజాజి పూలు ఎవరిమీద రాల్తాయి?

తెల్లవారి నిద్ర లేస్తూనే అమ్మా అని కూతుర్ని పిలిచేవాడు. తన తల్లి ముఖం చూసుకుని ఆపైన లోకం ముఖం చూసేవాడు. స్నానం చేసి దేవుడికి పూజ చేసుకుని కూతురికి ముందు హారతి కళ్ళకద్ది ఆపైన తను అద్దుకునేవాడు.

తనిప్పుడు పొద్దున్నే లేవగానే ఎవర్ని పిలవాలి?

తన పూజకి పూలు. కర్పూరం ఎవరందిస్తారు?

సీత పెద్దదయి సంబంధం కుదిరి పెళ్ళి ముహూర్తం నిశ్చయమైనప్పుడు. తన బతుకులో జరిగే ఒక శుభకార్యం ఘనంగా జరుగుతున్నపుడు అల్లుడికి కాళ్ళుకడిగి కన్యాదానం చేస్తుంటే తన బతుకంతా ధారపోస్తున్నట్లనిపించింది శివయ్యకి.

వరండాలో ఎవరో అరుస్తున్నారు. బళ్ళు వచ్చాయి ఇంకా ఆలస్యం ఏవిటని శివయ్య లేచి ఇంట్లోకి వచ్చాడు. బళ్ళల్లో సామాన్లు సర్దుతున్నారు. తన ఇంటినెవరో దోచుకుపోతున్నట్టుంది శివయ్యకు. ఒకొక్కక్కరే బళ్ళు ఎక్కుతున్నారు. శివయ్య ఏర్పాట్లు ఏవీ చూడ్డం లేదు. గదులన్నీ పిచ్చిగా తిరుగుతున్నాడు. ఒక మూలగా పార్వతమ్మ కళ్ళొత్తుకుంటోంది. ఆవిడకి తిరిగే ఓపిక కూడా లేదు.

ప్రయాణమైన సీత అందరికంటె ఆఖరున వచ్చింది.

పట్టుచీర! నగలు! మెళ్ళో గంధం. కాళ్ళకు పసుపు. నడుముకు వడ్డాణం.

తండ్రిపాదాలకు వంగి నమస్కరించింది.

పాదాలు పట్టుకు వదల్లేదు.

శివయ్య కూలబడి పోయాడు. సీత కళ్ళల్లోకి చూశాడు. "నా గుండె .... నాప్రాణం.... నా నెత్తురు .... నా రెండు కళ్ళూ నువ్వేనమ్మా .... వెళ్ళిపోతున్నావా తల్లీ .... నోటమాట రావటంలేదు. కన్నీటి పొరల్లో సీత కన్పించటం లేదు.

"ఏవిటట్లా ఇదయిపోతావ్! లోకంలో నువ్వే కూతుర్ని కన్నావా..... ఇది సహజం

లే లే ......." అంటూ ఎవరో లేవదీశారు.

ఇద్దరూ విడిపోయారు.....

శివయ్య కళ్ళు తుడుచుకుని, లేని దర్పం తెచ్చుకొని ఉత్తరీయం భుజాల కిరుప్రక్కలా వేసుకుని బళ్ళ వెనక నడవసాగాడు. మధ్యలో జ్వాలమ్మ గుడిదగ్గర ఆపించి కూతుర్ని తీసికెళ్ళి తల్లికి మొక్కించి "తల్లీ! నాకు కూతుర్నిచ్చి ఇలా అన్యాయం చేస్తావా ....." అన్నాడు.

వూరు దాటింది. ఆగిపోమన్నా వినకుండా శివయ్య బళ్ళ వెనకాలే వస్తున్నాడు. ఒకచోట బండి ఆపించి అల్లుణ్ణి దింపి పక్కకు తీసుకెళ్ళి రెండు చేతులూ పట్టుకుని అన్నాడు. "అయ్యా! నా తల్లిని పువ్వుల్లో పెట్టి పెంచాను. నాగుండెలో పెట్టుకుని సాక్కున్నాను. పిల్లది తెలియక ఎప్పుడన్నా తప్పు చేస్తుంది. అప్పుడు నీకు కోపమొస్తుంది ..... తప్పు లేదు ....... తిట్టాలనిపిస్తుంది ..... సహజమే ..... ఒక్కోసారి కొట్టాలనిపిస్తుంది ...... ఫర్వాలేదు .....అల్లాటప్పుడు ...... బాబ్బాబు ..... నాకు ఒక కార్డుముక్క రాయి ...... కాకితో కబురంపు. వాలిపోతాను. నీ కోపం తీరేదాకా నన్ను తిట్టు...... నీ కసిపోయేదాకా నన్ను కొట్టు - బాబ్బాబు తమలపాకు లాంటిదయ్యా నాతల్లి" అంటూ బావురుమన్నాడు. ఆమాటలకి అల్లుడికి కళ్ళనీళ్ళు తిరిగి ఏమీ చెప్పలేక పోయాడు. చుట్టూ ఉన్నవాళ్ళు 'ఛ! వూరుకో. విడ్డూరం' అని సర్ది బళ్ళని పంపించేశారు.

పొద్దుపోయి కాళ్ళీడ్చుకుంటూ ఇంటికొస్తే పార్వతమ్మ స్తంభానికానుకుని కూర్చుని వుంది. ఇల్లంతా బోసి పోయివుంది. మనసంతా ఖాళీగా వుంది - ఎవరూ మాట్లాడుకోలేదు. అన్నంవడ్డిస్తే ముట్టలేదు శివయ్య. పార్వతమ్మ అంది. "మా అయ్య నన్ను ఈ ఇంటికి పంపించినప్పుడు ఈ బాధ పడలేదా! నువ్వు నన్ను సల్లగ సూసుకోలేదా? అట్టాగే నీ కూతుర్నీ సూసుకుంటాడల్లుడు."

శివయ్య కళ్ళలో ధైర్యం.

"అదో! అది నీ కూతురి కిష్టమైన కూర. కలుపు" అంది పార్వతమ్మ.

ఆమాట వినగానే గబ గబ ఆ కూర కలిపాడు శివయ్య. కాని ముద్ద నోటి కెక్కదే!❊